## క్లుప్తంగా

### నియామకపత్రం అందజేత



వలంటీర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

**రామభద్రపురం:** మండల కేంద్రంలో మండలంలోని ఎస్.సీతారాంపురం గ్రామంలో కొత్తగా నియమితులైన వలంటీర్‌కు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతుల మీదుగా గురువారం నియామకపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలనలో పాదర్శకతే ప్రధానంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారని, ఆయా వ్యవస్థలతో అద్భుతమైన పరిపాలన నేడు రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. బాగా పనిచేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా చూడాలని వలంటీర్‌కు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు



శ్రీనివాసరావుకు కేక్ తినిపించి, బర్త్ డే విషెస్ తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

**రాజాం:** వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు మండలంలోని నాయకులంతా పట్టణంలోని ఆయన నివాసానికి క్యూ కట్టారు. ఆయనతో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచి.. బర్త్ డే విషెస్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతి, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, రాజాం జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

**రేగిడి:** మండలంలోని ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు విలేకరులకు గురువారం తెలిపారు. ఎస్సీ-70, ఎస్టీ-5, బీసీ-4, ఓసీ-1, ఇంటర్మీడియట్ సీఈసీ-40, ఎంఈసీ-40 సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 3, 4 తరగతులను గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి, రూ.1 లక్షకు మించి వార్షిక ఆదాయం ఉండని, సొంత జిల్లా వారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 17 సంవత్సరాలు దాటని విద్యార్థులు అర్హులన్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

**తెర్లాం:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఈవో త్రినాథరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. మండలంలో మొత్తం 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంప్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు మరమ్మతులకు గురైన తలుపులు, కిటికీలను బాగుచేయాలని దీనికి మెయింటెనెన్స్ నిధులను వినియోగించాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు.

### ర్యాంప్‌ల నిర్మాణం..



వంగర: పాఠశాలలో ర్యాంప్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

**వంగర:** రానున్న ఎన్నికల దృష్ట్యా దివ్యాంగ ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా మండలంలోని 15 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు. గురువారం మండలంలోని వంగర, సంగాం, అరసాడ గ్రామ పాఠశాలల ఆవరణలో జరుగుతున్న ర్యాంప్ పనులను ఆయన పరిశీలించారు. రూ.20 వేలు నుంచి రూ.30 వేలు వ్యయంతో ఒక్కో ర్యాంపు నిర్మిస్తున్నామని, వీటికోసం పాఠశాలల మెయింటెనెన్స్ నిధులు వినియోగించడం జరుగుతోందన్నారు. మెయింటెనెన్స్ నిధులు లేని పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



నాయుడువలసలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

**రామభద్రపురం:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని నాయడువలస గ్రామంలో కొత్తగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనం, జన్నివలస గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రాంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సంస్కరణలు తీసుకువస్తున్నారన్నారు. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనే లక్ష్యంగా ఆయన గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. ఆయా వ్యవస్థలతో ప్రజల వద్దకే పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతీవర్గంలోని ప్రజలకు మేలు జరిగేలా ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న అభిమతమని, ఆయన హయాంలో అందరికీ మేలు జరుగుతోందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్‌ల ద్వారా గ్రామస్తులకు గ్రామంలోనే వైద్యసేవలు, ఆర్‌బీకేల ద్వారా రైతులకు గ్రామంలోనే సకాలంలో విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు, సూచనలు అందివ్వడం జరుగుతోందన్నారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేయడం జరుగుతోందన్నారు.

**దేశ చరిత్రలో..**

పేద కుటుంబాలు బాగుండాలన్నా..అక్కచెల్లెమ్మల సాధికారత కొనసాగాలన్నా.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు.. దేశ చరిత్రలో ఏ పార్టీ, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేశారన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి, వారి కార్యకర్తలకే.. అదీ కొద్దిమందికే సంక్షేమ పథకాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ హయాంలో అర్హులైన వారందరికీ పార్టీలకు అతీతంగా పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99 శాతం హామీలు అమలు చేశారన్నారు. లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ మరోసారి వైఎస్సార్ సీపీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షుంనాయుడు, నాయుడువలస, జన్నివలస సర్పంచ్‌లు నడిమింటి లక్ష్మి, జన్ని సారంగదొర, ఎంపీటీసీ పప్పల నారాయణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు పత్తిగుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం.. ప్రాణదానం..



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

**బొబ్బిలి:** రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానానికి యువత, విద్యార్థులు ముందుకు రావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక పట్టణంలోని సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉండి, అత్యవసరమైన వారికి మనమిచ్చే రక్తం వారి ప్రాణం కాపాడడంతో పాటు వారి కుటుంబానికి ఓ పెద్దదిక్కును నిలబెట్టిన వారమవుతామన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యం చెడిపోతుందన్న అపోహ వీడాలని, రక్తం దానం చేస్తే ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. ఆరోగ్యవంతులైన వారంతా రక్తదానం చేసి, మానవత్వం చాటుకోవాలన్నారు. మండలంలోని పిరిడిలో ఉన్న గోకుల్ ఇంజినీరింగ్ కళాశాల బీ ఫార్మసీ, డీ ఫార్మసీ విద్యార్థులంతా శిబిరంలో పాల్గొని, రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి జి.శశిభూషణరావు, వైద్యులు గుల్ల రామ్‌నరేష్, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలిస్తున్న తలే రాజేష్

**రాజాం:** కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని బొద్దాం, సోపేరు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నాడు-నేడు పనులు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఉపాధ్యాయుల విద్యాబోధన, జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతీ సదుపాయం విద్యార్థికి అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థులను ఉన్నత విద్య దిశగా ప్రోత్సహించేందుకు పథకాలు, ట్యాబ్‌లు, బైలింగువల్ పుస్తకాలు ఉచితంగా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ పెరుమాళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో ప్రాధాన్యమివ్వాలి

- కొప్పుల వెలమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు



ఐక్యతను చాటుతున్న కొప్పుల వెలమ సంఘ నాయకులు

**బొబ్బిలి:** కొప్పుల వెలమ సామాజిక వర్గానికి రాజకీయాల్లో ప్రాధాన్యమివ్వాలని కొప్పుల వెలమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు కోరారు. ఇదే విషయమై స్థానిక కొప్పుల వెలమ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాదరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల మంది ఓటర్లు తమ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని, రాష్ట్రంలో రెండో అతిపెద్ద సామాజిక వర్గమైన కొప్పుల వెలమలకు బొబ్బిలి నియోజకవర్గంలో రాజకీయంగా ప్రాధాన్యమివ్వకుండా రాజులకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయిస్తుండడం తమ వర్గాన్ని రాజకీయంగా అణగదొక్కాలని చూడడమేనన్నారు. రానురాను రాజకీయ ప్రాబల్యం తగ్గుతున్న తమ సామాజిక వర్గానికి రాజకీయాల్లో తగిన గౌరవం దక్కేలా న్యాయం చేయాలన్నారు. నిజానికి బొబ్బిలిలో నాటి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు, పెద్దింటి జగన్మోహనరావు, ప్రస్తుత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు ప్రాధాన్యమివ్వడం వల్లే ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం, అభివృద్ధి, సంక్షేమం జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలైన పార్వతీపురం, సాలూరు, కురుపాంలో కూడా తమ వర్గానికి చెందిన వారే ఉన్నారని, ఆయా చోట్ల నుంచి రాజకీయ పదవుల్లో తమ వారికి ఉన్నత స్థానం కల్పించాలని కోరారు. తమ వర్గానికి ప్రాధాన్యమిస్తున్న వారికే రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దొగ్గ దేవుడు, బలగ సాయికృష్ణ, కర్రి సత్యనారాయణ, మేళాపు శ్రీహరినాయుడు, సీర సత్యంనాయుడు, గొట్టాపు కృష్ణమూర్తినాయుడు, కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### కుష్టువ్యాధిపై అవగాహన

**రేగిడి:** మండలంలోని ఉంగరాడ గ్రామంలో కుష్టువ్యాధి, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ అప్పారావు వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఏర్పడడం, కాళ్లు పూర్తిగా మూసుకుపోవడం, చెవితమ్మెలు మందంగా తయారవడం వంటివి వ్యాధి లక్షణాలు అని, ఇవి కనిపించిన వెంటనే ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

### సస్యరక్షణ చేపట్టాలి



నాయిరాలవలసలో అపరాల సాగును పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

**రేగిడి:** మండలంలోని తోకలవలస, అంబఖండి, పనసలవలస, బూరాడ, నాయిరాలవలస, ఉంగరాడ గ్రామాల్లో రబీ సాగులో భాగంగా పండిస్తున్న అపరాల పంటను ఏవో మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. ప్రధానంగా మినప పంట పూతదశలో ఉండడాన్ని ఆయన గమనించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు తెలిపారు. మంచు ప్రభావంతో పూత పాడయ్యే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు.

# పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



తలే రాజేష్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి, స్వాగతం పలికిన వీఆర్ అగ్రహారం గ్రామస్తులు

**రాజాం:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ సమష్టిగా పనిచేయాలని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో గురువారం సమావేశమైన ఆయన పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. అన్నివర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేలును వివరించి, ప్రతీ లబ్ధిదారుని ఓటు వైఎస్సార్ సీపీకే దక్కేలా చూడాలన్నారు. అలాగే గతంలో టీడీపీ హయాంలో ప్రజలకు ఆ పార్టీ చేసిన మోసం ఎండగట్టాలన్నారు. అంతకుముందు ఆయన పలువురి ఇళ్లకు వెళ్లి, ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించి, సీఎం జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ డబ్బాడ ఆదిలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం



షిర్డీసాయి విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

**సంతకవిటి:** మండలంలోని రంగరాయపురం గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకాలు, సామూహిక సత్యవ్రతాలు, చందనోత్సవం కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని వాసుదేవపట్నం, మద్దూరురామయ్య అగ్రహారం, సంతకవిటి, హొంజరాం గ్రామాల భక్తులతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలంలోని లాబాం, గుత్తావల్లి, చినలంకాం, పెద్దలంకాం ప్రాంతాల భక్తులు పాల్గొని, పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

# బాధ్యతల స్వీకరణ



బాధ్యతల స్వీకరణ అనంతరం మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి



సంతకవిటి: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

**బొబ్బిలి:** స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా ఎల్.రామలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎస్.శ్రీనివాసరావుకు జీవీఎంసీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో విశాఖపట్నం నుంచి ఈమె బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని వారు ఒకరినొకరు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**రామభద్రపురం:** ఎంపీడీవోగా సీహెచ్ ఈశ్వరమ్మ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రమామణికి విశాఖపట్నం జిల్లాకు బదిలీ కాగా, శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు నుంచి ఈమె బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

**సంతకవిటి:** ఎంపీడీవోగా ఎస్.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తెర్లాం ఎంపీడీవోగా పనిచేసి, బదిలీపై ఇక్కడకు వచ్చారు.

# పండగలా పింఛన్ల పంపిణీ

వాడవాడలా సామాజిక పింఛన్ల పంపిణీ పండగలా గురువారం జరిగింది. వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి, బయోమెట్రిక్, ఐరిష్ ఆధారంగా పింఛన్ నగదు అందజేశారు. మరికొన్ని చోట్ల సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నేతలు కూడా పింఛన్లు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ హయాంలో ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము అందుతుండడంతో లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్.



రామభద్రపురం శ్రీరామ్‌నగర్ కాలనీలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావు, వలంటీర్ జానకి



తెర్లాంలో ఇంటింటికీ వెళ్లి, పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ గౌరీశ్వరి



బాడంగి: చినభీమవరంలో లబ్ధిదారు వద్దకు వెళ్లి, పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ స్వప్న



బొబ్బిలి ఆరో వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ లక్ష్మీదేవి



రాజాం: సోపేరులో పింఛన్ నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



రేగిడి: కొండవలసలో లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ చిన్నమ్మడు



సంతకవిటి: సోమన్నపేటలో వృద్ధురాలితో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ మణి



వంగర: వంగరలో పింఛన్ అందిస్తున్న వలంటీర్



రేగిడి: రాజాం కేర్ ఆస్పత్రికి వెళ్లి, మరీ పింఛన్ అందిస్తున్న వలంటీర్ ధనలక్ష్మి



రాజాం సిటీ: గడిముడిదాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శంకరరావు

# నిరసన

**బొబ్బిలి:** సహారా ఇండియా వ్యవస్థాపక దినాన్ని బ్లాక్ డేగా అభివర్ణిస్తూ సహారా ఏజెంట్లు, ఖాతాదారులు శాంతియుత ర్యాలీ చేపట్టి, స్థానిక పట్టణ ప్రధాన రోడ్డులోని సహారా కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావించినా, కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# పక్కాగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకరరావు

**రాజాం సిటీ:** నవరత్నాలు పథకాల్లో భాగంగా పేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్లకు సంబంధించి, పక్కాగా రిజిస్ట్రేషన్లు చేపడుతున్నట్లు ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు. గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారులందరికీ సంబంధించిన ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసామర్థ్యాల పరిశీలన

**బొబ్బిలి:** మండలంలోని కుమందానపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు గురువారం సందర్శించి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. బాగా చదువుకుని, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. చదువులో వెనబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు.